

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి



జెసి ఛాంబర్ ఎదుట సిఐటియు, అంగన్వాడి నాయకులు

ప్రజాశక్తి -కడప అర్బన్ : అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జాయింట్ కలెక్టరు అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ అర్హులైన హెల్పర్స్‌కు ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల నమోదు చేయాలని పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధరలు ధమాల్



- రైతన్నకు కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి
- క(న)ష్టాలలో టమోటా రైతులు
- గతంలో రూ.సెంచరీకి పైన, నేడు రూ.10 లోపలే
- రెండు పెరగడంలోనూ.. తగ్గడంలోనూ పోటీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గత ఏడాది ఉల్లి, టమోటా ధరలు సెంచరీ దాటిన విషయం తెలిసిందే. రెండు పోటీపడి పెరిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అదేవిధంగా ప్రస్తుతం రెండు పోటీపడి తగ్గడంతో రైతన్నకు ఉల్లి కన్నీళ్లు పెట్టిస్తుంది. అలాగే టమాట నష్టాలను తెప్పిస్తుంది. ఉల్లి ధర ప్రస్తుతం కిలో రూ.10 లు ఉంది అలాగే టమోట ధర కూడా కి.లో. రూ.10 పలుకుతుంది. వీటి ధరలు చూస్తే రెండు పెరగడంలోనూ, తగ్గడంలోనూ పోటీ పడుతున్నాయని తెలుస్తుంది. టమాట, ఉల్లి రైతు దగ్గర నుంచి మాత్రం కిలో రూ .5 నుంచి రూ . 7 ఉంటుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



టమోట సాగులో పెట్టుబడులు అధికం

టమోట సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతోందని అన్నదాతల అంటున్నారు. టమోట కోతలు, మార్కెట్‌కు తరలింపు, రవాణా, ఎగుమతి దిగుమతి ఖర్చులు లెక్కిస్తే ఒక్కో బాక్స్‌కు రూ. 40 వరకు వ్యయమవుతుంది. ఒక్కో బాక్సుకు కమీషన్ రూ. 10 ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా అన్నింటిని భరించి విక్రయించినా ప్రస్తుత ధరలతో రైతుకు భారీ నష్టమే వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఉల్లికి భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు

సాగు పెట్టుబడి ఖర్చులు ఈ ఏడు భారీగా పెరిగాయి. గతంలో 28.28.28 ఎరువు బస్తా రూ.1,800 ఉండగా ప్రస్తుతం బస్తా రూ.2,200 వరకు చేరుకుంది. అలాగే ఒక బస్తా డిఎపి రూ.1,200 ఉండగా, ప్రస్తుతం రూ.1,700 వరకు పెరిగింది. ఇలా ప్రతి బస్తామీద రూ.400 చొప్పున అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎకరా ఉల్లి పంట సాగుకు 12-15 బస్తాల రసాయన ఎరువులు, క్రిమిసంహారక (నీళ్ల మందులు) మందులు ఒక సారికి రూ.2500ల చొప్పున కొనుగోలు చేసి 10 సార్లకు రూ.25 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎరువులు ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా రైతుల రాతమాత్రం మారలేదు..

ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ రైతుల తలరాతలు మాత్రం మారడం లేదు. ఎన్నికల సమయంలో ప్రత్యేక నిధులు కేటాయించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని మేనిఫెస్టోలలో పెడుతున్నారే తప్ప అధికారం వచ్చిన తర్వాత అటు ఆలోచించలేదదని రైతులు విమర్శిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆందోళన చేస్తున్నవే తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిపై దృష్టి సాధించకపోవడం రాజకీయం లబ్ధి కోసమే అన్న విషయం బహిర్గమవుతుంది. రైతుల పక్షాన ధర్నా చేస్తున్నారన్న విమర్శలు లేక పోలేదు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు రైతు సంక్షేమం కోసం దిష్టి సాధించాలని రైతులు కోరుతున్నారు.

రైతుల సమస్యలపై దృష్టి సారించాలి

మూడు ఎకరాలలో ఉల్లి సాగు చేశా. పంట కోతకు వచ్చే సరికి మార్కెట్‌లో ధరలు తగ్గిపోవడంతో నష్టపోతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల పంట దిగుబడులకు గిట్టుబాటు ధరలేదు. ప్రధానంగా ఉల్లి పంటను ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలి. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని గిట్టుబాటు ధరలు కల్పిస్తే బాగుంటుంది.

- రామాంజనేయులు, ఉల్లి రైతు, పెర్నపాడు గ్రామం

గిట్టుబాటు ధర కల్పించాలి

ధరలు బాగుంటాయని నా కున్న రెండు ఎకరాలలో ఉల్లి పంటను సాగుచేసుకున్నా. ఎకరానికి సుమారు 60-70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పెట్టుబడి ఖర్చులు భారీగా అయ్యాయి. చివరకు మార్కెట్లో ధరలులేక పెట్టుబడి ఖర్చుకూడా వస్తుందో? లేదోనని భయంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం కల్పించుకొని గిట్టుబాటు ధరకల్పించాలని కోరుతున్నా..

-రామ సురారెడ్డి, ఉల్లి రైతు, పెద్ద జూటూరు గ్రామం

దిగుబడి పెరగడంతో ధరలు తగ్గుముఖం

మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలలో దిగుబడి బాగా పెరగడం వల్ల ఉల్లి ధరలు తగ్గడానికి కారణం. మహారాష్ట్ర నుంచి భారీగా రాష్ట్రానికి ఉల్లి దిగుమతి కావడం వల్ల ధరలు మరింత తగ్గుముఖం పట్టడానికి కారణం.

- దస్తగిరి ఉల్లి వ్యాపారి పులివెందుల

వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళిక కసరత్తు

రూ.13,286 కోట్ల ప్రణాళికకు ఆమోదం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళిక కసరత్తు సిద్ధమైంది. జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం. ఇటువంటి ప్రాంతానికి వ్యవసాయ రుణాల కేటాయింపులను గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం రాజధాని కేంద్రమైన విజయవాడలో బ్యాంకర్లతో ఎస్ఎల్‌బిసి సమావేశాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లాల వారీగా వ్యవసాయ వార్షిక రుణ కేటాయింపులు చేసింది. గత ప్రభుత్వం 2024-25 వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా రూ.11 వేల కోట్ల రుణాలు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. వార్షిక రుణ ప్రణాళిక ముగింపు సమయానికి బ్యాంకర్లు రూ.13,431 కోట్లు రుణాలు మంజూరు చేయడం తెలిసిందే. 2025-26 జిల్లా వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా రూ.13,286 కోట్లతో జిల్లా అధికార యంత్రాంగం ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో రూ.5,191 కోట్లు, రబీ సీజన్‌లో రూ.3,607 కోట్లు ప్రతిపాదించింది. రూ.8,798 కోట్లతో వ్యవసాయ రుణాలు, రూ.4,022 కోట్లతో టర్మ్ రుణాలు, రూ.4,38 కోట్లు యాన్సిలరీ కార్యకలాపాల విభాగానికి చొప్పున కేటాయించినట్లు తెలుస్తోంది. అధిక శాతం బుక్ అడ్జెస్ట్‌మెంట్ రుణాలు ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. కొత్త రుణాలు ఏమేరకు ఇస్తున్నారనే అంశంలో స్పష్టత కొరవడింది. ఫలితంగా ప్రతి ఏటా రైతులు, కౌలురైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి రుణాలు సేకరించుకుని రుణాల ఊబిలో కూరుకుపోతున్న సంగతి తెలిసిందే. ఉపద్రవాలను అధిగమించాలంటే బుక్ అడ్జెస్ట్‌మెంట్ రుణాలను మినహాయించి నికరమైన రుణాలను మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.



'కడప ఉక్కు' ఏర్పాటుపై మోడీ స్పందించాలి

- అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం నిరసన



అంబేద్కర్ సర్కిల్ ఎదుట సిపిఎం నాయకులు నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

అమరావతి పర్యటన సందర్భంగా వెలగపూడిలో పర్యటించనున్న నరేంద్ర మోడీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై స్పందించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ విజ్ఞప్తి చేశారు. అమరావతి పర్యటన సందర్భంగా మోడీ కడప ఉక్కు నిర్మాణంపై స్పందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో స్పష్టంగా కడప ఉక్కు నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్న విషయం గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ సంకీర్ణ ప్రభుత్వాలే అధికారంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టడం పెద్ద కష్టమేమీ కాదని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. గతంలో కడప జిల్లా పరిషత్తు ఆవరణలో టిడిపి నేతలు ఉక్కు దీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటం చేసిన కూటమినేతలు ప్రస్తుతం అధికారంలో ఉన్నప్పటికీ ఏడాది గడిస్తున్న ఇంకా స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. రాయలసీమ ప్రాంతంలో నిరుద్యోగం, కరువు విలయతాండవం చేస్తున్న పరిస్థితుల్లో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి కొనసాగుతుందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కీలకమైందని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కడప జిల్లాలో శంకుస్థాపనల ఉక్కు పరిశ్రమ కావాలని అనుకోవడం లేదని, నిర్మాణం పూర్తి చేసి ఉక్కు పరిశ్రమ ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని జిల్లా ప్రజలు భావిస్తున్నారన్నారు. తక్షణమే కూటమినేతలు నరేంద్ర మోడీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు గట్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉక్కు పరిశ్రమ నిర్మాణం సాధ్యం కాకపోతే కూటమినేతలే జిల్లా ప్రజానీకానికి ద్రోహం చేసిన వారు అవుతారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరికొకరు సహకరించుకునే ధోరణి కొనసాగుతున్నప్పుడే ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించేలా ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ఉద్యమాలను చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రరెడ్డి, కుమారస్వామి రెడ్డి, నారాయణ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకట సుబ్బయ్య, హరిచంద్ర రెడ్డి, సాంబ శివారెడ్డి, నరసింహ, గోవిందు, తిమ్మయ్య, సరిత, జార్జి, శేఖర్, రసూల్, ఉదయ్, సురేంద్ర పాల్గొన్నారు.

'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్



నిరసన తెల్పుతున్న 102 డ్రైవర్లు, సంఘీభావం తెలిపిన నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కెప్టెన్(డ్రైవర్)ల సమస్యలను పరిష్కరించాలని ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 మంది తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరూ ప్రస్తుతం అరబిందో (ఎఇఎంఎస్) సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖకు సేవలందిస్తున్నారు. అరబిందో యాజమాన్యం తమకు ఏడేళ్లుగా నెలకు కేవలం రూ. 8,800 వేతనాన్ని మాత్రమే చెల్లిస్తుందని తెలిపారు. సిటిసి పేరిట యజమాని కట్టాల్సిన పిఎఫ్ వాటాను కూడా ఉద్యోగుల నుంచే మినహాయిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. ఆదివారం/ వీక్లీ ఆఫ్‌లు, పండుగలు, చట్టప్రకారం అమలు చేయాల్సి ఉండగా సెలవులు ఏవి కూడా వీరికి అమలు చేయడం లేదని వాపోయారు. ఇంక్రి మెంట్లు లేవని, ఏజెన్సీల ద్వారా నియమించ బడినా ప్రధాన యజమాని వైద్య, ఆరోగ్యశాఖ, రాష్ట్ర ప్రభుత్వమే అన్నవిషయం అందరికీ తెలిసిందే అన్నారు. చట్టప్రకారం చెల్లించాల్సిన వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు అమలు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖదే అన్నారు. అరబిందో యాజమాన్యం మారుతున్న నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలను ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమే ప్రభుత్వమని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేసేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 102 వాహన జిల్లా అధ్యక్షులు సోము మహేష్, జిల్లా ఉపాధ్యక్షులు చరణ్, సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్ర రెడ్డి, వంశీ, దస్తగిరి, ఓబుల్ రెడ్డి, నాగేశ్వరరావు, నరేష్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.పవన్ కార్మికులు పాల్గొన్నారు.

పిఎం సభకు వెళ్లి వస్తుండగా

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి - ఉంగుటూరు



నాగరాజు (ఫైల్‌ఫొటో)

అమరాతి రాజధాని పున:నిర్మాణ సభకు వెళ్లి తిరిగి వస్తు ఉండగా ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో డ్వాక్రా హెచ్ఆర్ సీసీ దేవళ్లతిమ్మల్ల నాగరాజు (48) దుర్మరణం చెందారు. బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలంలో డిఆర్‌డిఎలో హెచ్ఆర్ సీసీగా నాగరాజు ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారు. కడప జిల్లాకు చెందిన నాగరాజు ఉద్యోగ రీత్యా మలికిపురంలో భార్య పిల్లలతో ఉంటున్నారు. ఈ క్రమంలో అమరావతిలో మోడీ సభకు జనాలను బస్సుల్లో తరలించేందుకు నాగరాజుకు డ్యూటీ వేశారు. ఈ నేపథ్యంలో 35 మందితో బస్సు శుక్రవారం ఉదయం అమరావతి వెళ్లింది. అయితే ట్రాఫిక్ కారణంగా బస్సును పోలీసులు సభవేదిక సమీపంలోకి రానీయకపోవడంతో బస్సు తిరిగి మలికిపురం బయలు దేరింది. ఈ క్రమంలో ఉంగుటూరు మండలం కైకరం వద్ద టీ కోసం బస్సు ఆగింది. మూత్ర విసర్జన కోసం నాగరాజు రోడ్డు దాటుతుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కోళ్ల లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అపస్మాక స్థితిలోకి వెళ్లిన నాగరాజును హైవే అంబులెన్సులో ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చేబ్రోలు ఎస్ఐ సూర్య భగవాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి ఉంగుటూరు వెలుగు ఎపిఎం ప్రభావతి సంతాపం వ్యక్తం చేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గోపవరం : అకాల వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య పేర్కొన్నారు. మండలంలోని రాచేయపేట గ్రామ పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ అకాల వర్షం వల్ల ఎక్కడా రైతులు నష్టపోలేదని, ఇక ముందు వర్షాలు పడితే పెసర, వేరుశనగ పంటలు నష్టపోయే అవకాశాలు ఉన్నాయి, కాబట్టి కాయ్యల్లో నిల్వ ఉన్న నీటిని వదలాలని చెప్పారు. అలాగే వేరుశనగ వేసిన రైతులు ఈ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే కొంచం ఇబ్బందులు ఎదుర్కొంటార ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎఫ్ఒ సిసి సుదర్శన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసులు సురేష్

ప్రభుత్వ పథకాలను అసంఘటిత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి శ్రీనివాసులు పారా లీగల్ వాలంటీర్లు జిలాని, సురేష్ సహాయం అన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కడప నగరం సంధ్యా సర్కిల్‌లో అసంఘటిత కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులు, గృహ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి-యజమాని సమస్యలు, అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అసంఘటిత కార్మికుల సమస్యలను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. కనీస వేతనాల చట్టం, పని వేళలు మొదలగు వాటిని వివరించారు, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, ఇతర నిబంధన చట్టం గురించి వివరించారు. న్యాయసేవాధికార సంస్థ యొక్క విధి విధానాలు తెలియజేశారు. పార లీగల్ వాలంటరీ లు, ప్యానల్ న్యాయవాదుల , లీగల్ ఎయిడ్ క్లినిక్స్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం యొక్క విధి విధానాలు తెలియజేశారు. లోక్ అదాలత్, లోకాయుక్త, ఉపయోగాలు తెలియజేశారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి గోపవరం : బద్వేలు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిరువెంగలపురం హెల్త్ వెల్నెస్ కేంద్రంలో కిసార్ వికాస్ 10-19 యుక్త వయస్సు ఉన్నటువంటి బాలికలకు పోషకాహారం గురించి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందరంగా హెల్త్ ఎడ్యుకేటర్ బి. వెంగయ్య మాట్లాడుతూ ఈనెల 2 నుంచి గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో కిషోర్ బాలికలకు పరిశుభ్రత, ఆహారపు అలవాట్లు, విద్యపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రవతి, హెల్త్ సూపర్‌వైజర్ కె.వెంకటమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్వాడీ కేంద్రం టీచర్లు, ఆశా కార్యకర్తలు పి.నాగమ్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు.



దాచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ లోకానికి దార్శనికుడు 'దాచూరి'

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా

ప్రజాశక్తి కడప అర్బన్

దాచూరి రామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ యుటిఎఫ్‌ను రాష్ట్రంలో బలమైన సంఘంగా రూపొందించడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. దాచూరి రామిరెడ్డి రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన కాలంలో ఉపాధ్యాయులకు అనేక రాయితీలను సాధించి పెట్టారని తెలిపారు. విద్యారంగ వినాశకర విధానాలు అవలంబించినప్పుడు ప్రభుత్వాలపై అనేక పోరాటాలు చేసిన ఉద్యమ నాయకుడు దాచూరి అని పేర్కొన్నారు. తన జీతాన్ని, జీవితాన్ని ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితం చేసిన త్యాగశీలి అన్నారు. ఎమ్మెల్సీగా పనిచేసిన కాలంలో తన ఖర్చులకు పోను మిగిలిన సొమ్మును యుటియఫ్ సంఘానికి ప్రజా సంఘాలకు జమ చేశారన్నారు. ఉపాధ్యాయులకు, సంఘ నాయకులకు దాచూరి రామిరెడ్డి లాంటివారు దిక్సూచి అని తెలిపారు. నేటి ఉపాధ్యాయ లోకం ఆయన అడుగుజాడల్లో పయనించడంతో పాటు బడుగు బలహీన వర్గాలకు ఆసరాగా నిలిచి ప్రభుత్వ విద్యా పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహమ్మద్ ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, కేదార్నాథ్, ప్రకాష్ బాబు, దావుద్దీన్ పాల్గొన్నారు.

బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బీచు నాగేశ్వరరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బీచు నరేష్ కుమార్ రెడ్డి సుమారు 1000 మందికి పైగా రోగులు, వారి కుటుంబ సభ్యులకు పోషకాహారంతో కూడిన శుభ్రమైన భోజనాన్ని పంపిణీ చేశారు. ప్రతినెలా రెండవ సోమవారం నిర్వహించే సేవా కార్యక్రమాల భాగంగా కొనసాగుతోందరన్నారు. వర్ధంతి సందర్భంగా వారి భార్య బీచు అక్కయ్య, కోడలు బీచు వీణా వాణి, మనుమడు బీచు ధన్విత్ కుమార్ రెడ్డి, మనవరాలు కియాన్షి, బీచు శివనాగి రెడ్డి, బీచు చేతన్ రెడ్డి, బీచు హిమ శివ శంకర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఎన్‌సిసి వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న కల్నల్ సూర్యనారాయణ మూర్తి

30వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎన్. సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌సిసి ఒకటవ కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరాన్ని తెలుగుగంగ కాలనీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ కల్నల్. మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక సేవ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి ఎన్‌సిసి క్యాంపులు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ శిబిరంలో కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుండి దాదాపు 500 మంది ఎన్‌సిసి కేడెట్లు పాల్గొంటున్నారు. డ్రిల్, మ్యాప్ రీడింగ్, ఆయుధ విడభాగాలను జోడించడం, విడదీయడం, ఫైరింగ్ వంటి వాటిలో ప్రత్యేక శిక్షణ ఇస్తారని వివరించారు. దానితోపాటుగా రహదారి భద్రత, సైబర్ సెక్యూరిటీలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జె. ఆత్రే, ఎన్‌సిసి అధికారులు కెప్టెన్. డాక్టర్ నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్ పరేడ్ శిక్షణ అధికారులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, రూపేంద్ర జిత్ సింగ్, సి.ఎల్. రెడ్డి, కొండారెడ్డి , గర్ల్ కేడెట్లు ఇన్స్ట్రక్టర్ మిశ్రా ఆఫీస్ సిబ్బంది సూపరిండెంట్ డేవిడ్, ఉమా, మల్లేశ్వరి, శివప్రసాద్, రాజగోపాల్ రెడ్డి, ఎన్.సి.సి సీనియర్ క్యాడెట్లు మల్లి, ఆనంది పాల్గొన్నారు.

లాంగ్ మార్చ్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం చేసిన వక్ఫ్ సవరణ నల్ల చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపును సమర్థిస్తూ కడప జాయింట్ యాక్షన్ కమిటీ(తహఫుజ్ ఏ వక్ఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 4న కడప నగరంలో నిర్వహించే లాంగ్ మార్చ్ ను జయప్రదం చేయాలని జెఎసి చైర్మన్ సయీద్ అహ్మద్, కన్వీనర్ అబ్దుల్ రెహ్మాన్ బాగ్దాదీ పిలుపు నిచ్చారు. స్థానిక గౌస్ నగర్ నుంచి ఉదయం 9 గంటలకు ఈ లాంగ్ మార్చ్ బయలుదేరి మాసాపేట సర్కిల్, అమీన్ పీర్ దర్గా, అగాడి 4 రోడ్ల కూడలి, ఇనాయత్‌ఖాన్ తాలిం, అల్మాస్‌పేట టిప్పు సుల్తాన్ సర్కిల్, చిలకల బావి, బహదూర్ ఖాన్ మసీదు, రెండవ గాంధీ బొమ్మ, వన్‌టౌన్ సర్కిల్, గోకుల్ సర్కిల్ మీదుగా ఏడు రోడ్ల వరకు ఉంటుందని తెలిపారు. లాంగ్ మార్చ్‌లో కులాలకు, మతాలకతీతంగా ప్రజలందరు పాల్గొనాలని కమిటీ సభ్యులు సిరాజుద్దీన్ బుఖారీ, మహమ్మద్ అలీ బాగ్దాది, సలీం బుఖారీ, ముఫ్తి ఖలీలుల్ రెహ్మాన్, అబ్దుల్ రషీద్, నిజాముద్దీన్ బుఖారీ, అక్బర్ అలీ రషాది కోరారు.

లాంగ్ మార్చ్ పోస్టర్ విడుదల..వక్ఫ్ నూతన సవరణ చట్టానికి వ్యతిరేకంగా గ్రాండ్ లాంగ్ మార్చ్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను వక్ఫ్ పరిరక్షణ జెఎసి జిల్లా కన్వీనర్ అహ్మద్ బాబు, సిటీ కన్వీనర్ జాకీర్ చేతుల మీదుగా వక్ఫ్ పరిరక్షణ జెఎసి జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ పీర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా గౌస్ పీర్ మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధంగా జరిగిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున గ్రాండ్ లాంగ్ మార్చ్ కార్యక్రమం ఈనెల 4న ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీలకు, కులమతాలకతీతంగా భారీ సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మన రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరిగిన ఈ చట్టాన్ని రద్దు చేసేలా మన గళాన్ని కేంద్రానికి వినిపించేలా అన్ని నినదించాలని కోరారు. గౌస్ నగర్ నుంచి మొదలు పెట్టి మాసాపేట సర్కిల్, పెద్ద దర్గా, శివలింగం బీడీ ఫ్యాక్టరీ, అల్మాస్పేట సర్కిల్, పెద్ద మట్టి పులి, రెండో గాంధీ బొమ్మ, వన్ టౌన్ సర్కిల్, గోకుల్ సర్కిల్, ఏడు రోడ్ల కూడలి వరకు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లిం నాయకులు



విద్యార్థి జోషికాకు జ్ఞాపికను అందిస్తున్న ఉపాధ్యాయులు

'పది' టాపర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

మారుమూల గ్రామంలో ఉంటూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన జోషికకు నియోజకవర్గంలోని ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల వెలువడిన పదవతరగతి ఫలితాల్లో సింహాద్రిపురం మండలం రావులకొలను జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థిని పల్లేటి జోషిక 595 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఆమెకు శుక్రవారం వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రీజినల్ కార్యాలయంలో సి.కె. వెంకటనాథరెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పులివెందుల మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖరరావు, రామానాయుడు, లింగాల మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణయ్య మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు ఉంటారని, వారిలో దాగివున్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీస్తే, దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలను, ఐఎఎస్ అధికారులను, ప్రముఖ క్రీడాకారులను తయారు చేయవచ్చని చెప్పారు. మట్టిలోఉన్న మాణిక్యాలను గుర్తించడం ఉపాధ్యాయుల బాధ్యత అని వారు పేర్కొన్నారు. రావులకొలను జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థిని పల్లేటి జోషిక 595 మార్కులు సాధించి, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా ఫస్ట్ ర్యాంక్, అదేవిధంగా రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. అనంతరం ఆమెను వారు సత్కరించి జ్ఞాపికను అందించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు ప్రతిభావంతురాలైన విద్యార్థిని ఉన్నతవిద్య కోసం రూ. 15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తొండూరు సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సికె వెంకటనాథరెడ్డి, రావులకొలను హైస్కూలు ఉపాధ్యాయుడు ఈశ్వరరెడ్డి పులివెందులశాఖ గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి, గోపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, సురేష్ రెడ్డి, రఘునాథరెడ్డి, పవన్, ఓబుల్ రెడ్డి, జగన్, కరుణాకర్ రెడ్డి, మదార్, ఈశ్వరయ్య, సతీష్, సుదర్శన్ వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మైదుకూరు అర్బన్ సిఐగా రమణారెడ్డి

ప్రజాశక్తి - చాపాడు



మైదుకూరు అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐగా రమణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా పలువురు సిఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పి అశోక్ కుమార్ గురువారం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇక్కడ పనిచేస్తున్న శ్రీహరిని కడప సిసిఎస్ సీఐగా బదిలీ చేశారు. ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సిఐగా ఉన్న రమణారెడ్డిని మైదుకూరుకు నియమించారు. స్టేషన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచుతామన్నారు.

కడప తాలూకా సిఐగా రెడ్డప్ప బాధ్యతల స్వీకరణ

కడప అర్బన్ : కడప తాలూకా సిఐగా రెడ్డప్ప బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం స్టేషన్లలోని కానిస్టేబుళ్లు ఆయనకు స్వాగతం పలికారు. రెడ్డప్ప జిల్లాలో పలు పోలీస్ స్టేషన్‌లలో సిఐగా పనిచేశారు.



ఉపాధి కూలీలకు సూచనలు ఇస్తున్న ఇసి మధుసూదన్ రెడ్డి

'ఉపాధి' పనులు తనిఖీ

ప్రజాశక్తి - వేముల

మండలంలోని గొందిపల్లె గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి చట్టం పనులను శుక్రవారం ఇసి మధుసూదన్‌రెడ్డి తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి దినసరి కూలి రూ. 307 పొందాలని, జాబ్ కార్డుల్లో ఒకరి పేరు మీద మరొకరు రాకూడదని, జాబ్ కార్డులో ఉన్నవారే ఉపాధి పనికి రావాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల లోపు పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. గత వారంలో ఉపాధి కూలీల నగదు త్వరలోనే కూలీల అకౌంట్లో జమ కానున్నయన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ఇది సంవత్సరానికి రూ. 436 ప్రీమియం చెల్లించడం ద్వారా, రూ. 2 లక్షల జీవిత బీమా అందుతుందని చెప్పారు. ఈ పథకం 18 నుండి 50 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తులకు అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రెడ్డిబాషా, ఫీల్డ్ అసిస్టెంట్ ఆసం గంగాదేవి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రామాలయానికి నగదు విరాళం అందజేత

ప్రజాశక్తి- ఖాజీపేట : మండలం పరిధిలోని సుంకేసుల గ్రామంలో నూతన రామాలయ నిర్మాణ పనుల నిమిత్తం ఖాజీపేటకు చెందిన మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ కుంట్ల శ్రీరాములు రూ. 1,10,000 మొత్తాన్ని శుక్రవారం అందజేశారు. జిల్లా కాంగ్రెస్ పారీ ఎస్‌సి సెల్ మాజీ జిల్లా చైర్మన్ గున్నం పాటి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డాక్టర్ ఫయాజ్ చేతుల మీదుగా మొత్తాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి నాయకులు శ్రీరాములు ఆర్థిక సాయం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమ లో మైనార్టీ నాయకులు షేక్ హాజీ గౌస్, మహేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

స్థానిక రైల్వేస్టేషన్‌లోని రైలులో పాండిచ్చేరి నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంను ఆర్‌పిఎఫ్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఆర్‌పిఎఫ్ సిఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. నంద్యాల కు చెందిన ఇద్దరు వ్యక్తులు రూ. 25 వేలు విలువ చేసే 65 మద్యం బాటిళ్లను రైలులో తీసుకెళుతుండ గా పట్టుకున్నట్లు చెప్పారు. వారిద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా మద్యం బాటిళుల పట్టుబడ్డాయని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో ఎస్ఐ సలాం, ఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు



రైలులో పట్టుకున్న అక్రమమద్యం బాటిళ్లను చూపుతున్న ఆర్‌పిఎఫ్ పోలీసులు

వేంపల్లె మండలాన్ని

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- విద్యా బోధన సరిగా లేక పోవడంతోనే 'పది'లో ఉత్తీర్ణత తగ్గింది
- సమావేశాలకు అధికారులు తప్పక హాజరుకావాలి
- మండల సమావేశంలో సభ్యుల తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో పంటలు పండక రైతులు, ప్రజలు అల్లాడుతున్నారని, మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తీర్మానం పంపించాలని ఎంపిటిసి సభ్యుల తరుపున జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో ఉన్న వైఎస్ఆర్ సభా భవనంలో ఎంపిపి లక్ష్మి గాయత్రీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి వేంపల్లె మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు తీర్మానం ప్రవేశ పెట్టారు. ఎంపిటిసి సభ్యులందరూ అ తీర్మానానికి మద్దతు ప్రకటించారు. సమీక్ష సమావేశానికి కొందరు అధికారులు డుమ్మా కొట్టడతో జడ్‌పిటిసితోపాటు ఎంపిటిసి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు మండల సమావేశం నిర్వహిస్తే అధికారులు గైహాజరు కావడం సరైదని కాదని ఎంపిటిసిలు కటిక చంద్ర శేఖర్, రహంతుల్లా ఖాన్, మొబినా, భారతి, కొండయ్యలు పేర్కొన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిపి లక్ష్మి గాయత్రీ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య లేక పోవడం వల్ల వేంపల్లె మండలంలోని కత్తులూరు, మిట్టపల్లి, తూపల్లె, ముసల్ రెడ్డి గారి పల్లెలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మూసి వేశారని చెప్పారు. కాబట్టి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రజల్లో చైతన్యం తీసుకొని వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఎంఇఒ స్టాలిన్ కోరారు. పదవ తరగతి ఫలితాలలో ఉత్తీర్ణత శాతం తగ్గడం చాలా బాధగా ఉందని జడ్‌పిటిసి పేర్కొన్నారు. రూ.15 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలను నిర్మిస్తే ఇలాంటి ఫలితాలు పదోతరగతిలో రావడం చూస్తే సిగ్గుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సప్లమెంటరీలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలోని ఆవరణలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఇఒ కోరారు. జడ్పీ పాఠశాల ఆట స్థలానికి చెందిన ప్రహరీని కూల్చివేశారని విద్యా శాఖ నిధులతో నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి మణి గోపాల్ రెడ్డి, పద్మా రాజ్ కుమార్ కోరారు. మండలానికి 260 ఫారం ఫండ్‌లు మంజూరు అయ్యాయని ఉపాధి ఎపిఒ పార్వతి సభ దృష్టికి తెచ్చారు. ఉద్యాన పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తే అయా పథకాల ద్వారా పండ్ల మొక్కలను ఇస్తామని హార్టీకల్చర్ ఎఒ రెడ్డయ్య చెప్పారు. ఈదురు గాలులతో 40 ఎకరాల్లో అరటి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు చెప్పారు. వెదురు సాగుకు ప్రభుత్వం ప్రోత్సహం ఇస్తున్నట్లు చెప్పారు. వేంపల్లెలో పంచాయతీ చాలా అధ్వానంగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిటిసిలు కోరారు. ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు గడువు పెంచారని లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని హౌసింగ్ ఎఇ యోగీశ్వరబాబు కోరారు. సమీక్ష సమావేశానికి చెందిన నోటీసును మండల స్థాయి అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తప్పకుండా చేరవేసే బాధ్యత ఎంపిడిఒ తీసుకోవాలని జడ్‌పిటిసి కోరారు. నోటీసులు ఇవ్వలేదని వస్తున్న ఫిర్యాదులు ఇక నుంచి రాకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపిడిఒ కుళాయమ్మ, వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్, ఐసిడిఎస్ సిడిపిఒ సునీత, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రవణమ్మ, మొబినా, ఎంపిటిసిలు చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రదీప్ కుమార్‌రెడ్డి, హబిబుల్లా, సర్పంచ్ మధు ప్రభాకర్ రెడ్డి, బైపిరెడ్డితో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



అధికారులతో కలిసి అరటి పంటలను పరిశీలిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - వేంపల్లె

గాలి, వానకు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈదురు గాలులతో నష్ట పోయిన అరటి పంటలను కాంగ్రెస్ నేతలతో కలిసి తులసిరెడ్డి పరిశీలించారు. అరటి పంటను సాగు చేసిన కౌలు రైతులతో చర్చించారు. అడవి పందులు, ప్రకృతి వైపరీత్యాలు, ధర లేక పోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు కాంగ్రెస్ నాయకులకు చెప్పారు. ఎకరాకు రూ 2 లక్షలు వరకు పెట్టుబడి పెట్టామని, పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి, పెను గాలికి పూర్తిగా నేలమట్టం అయ్యిందని తెలిపారు. ప్రభుత్వం ఉదారంగా ఆదుకోకపోతే ఆత్మహత్యే తమకు శరణ్యమని కౌలు రైతులు రామగంగి రెడ్డి, గజ్జల ఈశ్వర్ రెడ్డి వాపోయారు. ప్రభుత్వం ఎకరాకు కనీసం రు 50 వేలు పెట్టుబడి సాయం అందించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాల వర్షంతో అరటి పంట తీవ్రంగా దెబ్బతిందని చెప్పారు. రైతులకు అరటి పిలకలను ఉచితంగా సరఫరా చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎద్దుల కొండపై ఉన్న ఆలయంపై పిడుగు పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. పిడుగుపాటుకు దెబ్బతిన్న ఎద్దుల కొండ్రాయుని దేవాలయాన్ని ప్రభుత్వం పునరుద్ధరణ చేపట్టాలని కోరారు కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రినాథ్, వేమారాజా, వేమయ్యా, నాగరాజు, రమణ, వినయ్, మహేష్, అశ్వంత్ పాల్గొన్నారు.

పంట నష్టం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఆకాల వర్షంతో పాటు ఈదురు గాలులతో నష్ట పోయిన అరటి పంట రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హార్టీకల్చర్ ఎఒ రెడ్డయ్యతో కలిసి ఈదురు గాలులతో నష్టం జరిగిన అరటి తోటలను టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పరిశీలించారు. అ రైతులతో పంట నష్టంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ హార్టీకల్చర్ అధికారులు పంట నష్టానికి చెందిన నివేదికలను తయారు చేయాలని కోరారు. ప్రతి రైతును ఆదుకొనేందుకు పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ద్వారా సిఎం దృష్టికి తీసుకొని వెళ్తామని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులకు నష్టాలు వస్తున్నట్లు చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పండ్ల తోటలకు కూడ ప్రభుత్వం చేయూత ఇస్తుందని చెప్పారు. అధికారులు కూడ రైతులకు న్యాయం జరిగే విధంగా తోటలు వలన నష్టపోయిన రైతుల పేర్లను నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు తెలంగాణ వలి, డక్కా రమేష్, మడక శ్రీనివాసులు తో పాటు రైతులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒను వెంటనే సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒగా పనిచేస్తున్న మీనాక్షి విధులకు హాజరు కాకుండా ప్రభుత్వ సమయాన్ని తన సొంతపనులకు ఉపయోగించుకుంటూ ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నారని వెంటనే ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఎఐఎస్‌బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, అఖిల భారత విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం విధులకు హాజరుకాని డిప్యూటీ డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ డిఇఒ ఒక ఉన్నతమైన హోదాలో ఉండి మధ్యాహ్నం ఒంటిగంట అయినా విధులకు హాజరు కాకుండా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండకుండా విధులకు డుమ్మా కొడుతూ తన స్వలాభ ప్రయోజనాల కోసం ప్రకులాడుతున్నారని విమర్శించారు. డిటైర్డ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆఫీసులో ఏదైనా పని కోసం ఎండా తీవ్రంగా ఉన్నా కూడా ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఉంటే, ఆఫీసుకు వచ్చినటువంటి వారు అధికారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు సమస్యలు చెప్పుకోవడానికి డిప్యూటీ డిఇఒ కార్యాలయానికి వస్తే ఏ రోజు అందుబాటులో ఉన్న పాపాన లేదని వాపోయారు. గతంలో కడప జిల్లా డిఇఒగా పనిచేసేటప్పుడు విధుల అలసత్వం వల్ల ఆమెను పదవి నుండి తొలగించారని, అయినప్పటికీ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని పేర్కొన్నారు. అందుబాటులో లేని డిప్యూటీ డిఇఒను వెంటనే సస్పెండ్ చేయకపోతే విద్యార్థి యువజన ప్రజాసంఘాలను కలుపుకొని భవిష్యత్తులో విద్యాశాఖ మంత్రిని పాఠశాల కమిషనర్‌ను కలిసి జిల్లా స్థాయిలో ప్రత్యక్ష ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పొంచి ఉన్న ప్రమాదం

రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
పట్టని అధికారులు - ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండల పరిధిలోని గూడెంచేరువు రాజీవ్ నగర్ కాలనీలో ప్రమాదం పొంచి ఉంది. రక్షణ కంచె లేకుండానే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్మతో ఏర్పాటు చేయడంతో ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం వాటిలుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడుపుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేయాల్సిన సంబంధిత అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు అన్ని ఇళ్ల సమీపంలోనే ఉన్నాయి. పైగా తక్కువ ఎత్తులో ఉండడంతో చిన్నారులు, వృద్ధులు అటుగా వెళ్లే వారు గమనించకపోతే పెద్ద ప్రమాదమే వాటిల్లనుంది. మరికొన్ని ట్రాన్స్ ఫార్మర్లు ఒక అడుగు, రెండు అడుగుల ఎత్తులో మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వం రోడ్లు వేయడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు తగ్గడంతో పాదచారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆదమరిస్తే ప్రమాదం పొంచి ఉంది. రాజీవ్ నగర్ కాలనీలో మెయిన్ రోడ్డు కాకుండా మధ్యలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా ప్రతి మూడు వీధులకు ఒక ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు వెంబడి ప్రతి కార్నర్‌లోను అంగళ్లు ఉన్నాయి. అందుకు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చిన్న పిల్లలకు సైతం ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉంది. ప్రమాదవశాత్తు పిల్లలు ఆడుకుంటూ ఉన్న సమయంలో బంతి, లేదా ఏదైనా ఆట వస్తువు పడినా వెళ్లి తీసుకోవాలంటే సాహసం చేయాల్సిందే. అదే కాకుండా మేకలు, గొర్రెలు, గేదెలు గడ్డి కోసం వెళ్లే ప్రమాదం ఉంది. దీంతో రోడ్డుగుండా వెళ్లాలనుకునే వారికి ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ట్రాన్సార్మర్ ఉన్న చోట పక్కనే జాయింట్ గోడకు కొన్ని చోట్ల అటాచ్ చేసి ఉన్నారు. మరి కొందరు వాటి పక్కనే వంటకు ఉపయోగించే కట్టె పుల్లలు వేసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ట్రాన్స్ ఫార్మర్‌కు రక్షణ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తక్కువ ఎత్తులో రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



పట్టా అందుకుంటున్న సౌజన్య

జెఎన్‌టియు ప్రొఫెసర్ సౌజన్యకు డాక్టరేట్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని జెఎన్‌టియు కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.వి సౌజన్యకు డాక్టరేట్ సాధించారు. జెఎన్‌టియు కళాశాలలో పనిచేస్తూనే డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం యూనివర్సిటీ ఇండోలో ఆరేళ్లుగా పిహెచ్‌డి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనికేషన్స్ , ఇమేజ్ ప్రాసెసింగ్ ను ఉపయోగించి ఒక అల్గారిథమ్, విభిన్న సాంకేతికత విశ్లేషణకుగాను పట్టా లభించిందని చెప్పారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. విష్ణు వర్ధన్, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శేషమహేశ్వరమ్మ, ఇసిఇ హెచ్‌ఒడి డాక్టర్ షేక్.తాజ్ మహబూబ్, తోటి అధ్యాపకుల బృందం ఆమెను అభినందించారు.

ట్రిపుల్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్‌కూ..



పట్టా అందుకుంటున్న మునిబాబు

వేంపల్లె : ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ముమ్మెల మునిబాబు అనంతపురం జెఎన్‌టియు డాక్టరేట్ ఇచ్చింది. అనంతపురంలోని జెఎన్‌టియు వీడియో ట్రాన్స్‌మిషన్ స్కీమ్స్ టు ఇంప్రూవ్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్, ఇన్ వైర్ లెస్ నెట్ వర్క్ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్ పాకనాటి చెన్నారెడ్డి, కర్నూలు జి. పుల్లా రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న రాచపూడి ప్రవీణ్ శ్యామ్ సంయుక్త ఆధ్వ ర్యంలో మునిబాబు పిహెచ్‌డి పూర్తి చేశారు. మునిబాబుకు డాక్టరేట్ రావడం పట్ల ట్రిపుల్ ఐటి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ముంతాజ్ బేగం

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

కౌమార దశలో ఉన్న బాల, బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి జాగ్రత్తలు పాటించాలని ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ముంతాజ్ బేగం సూచించారు. ముద్దనూరు -1 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సచివాలయం మహిళా పోలీసులు ఆకాంక్ష, శివజ్యోతి కిశోరి వికాసంపై బాల, బాలికలకు ప్రత్యేక వేసవి శిక్షణా కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోరి బాల, బాలికలు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.బాల్య వివాహాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కిశోరి బాల, బాలికల వికాసంపై జూన్ 10వరకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమా రాణి, కార్యకర్తలు ప్రభావతి, కిరణ్మయి, విజయమ్మ, గంగాభవాని పాల్గొన్నారు.


విఆర్ఎల మండల అధ్యక్షులుగా నారాయణ

ప్రజాశక్తి - చక్రాయపేట



విఆర్ఎల మండల అధ్యక్షుడిగా నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా విఆర్ఎల మండల అధ్యక్షుడు నాగేంద్ర తెలిపారు. శుక్రవారం చక్రాయపేట మండల కేంద్రంలో నూతనంగా విఆర్ఎల మండల కమిటీ సమావేశం జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షులు నాగేంద్ర, ఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య, జిల్లా కోశాధికారి వెంకటపతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో చక్రాయపేట మండలంలోని విఆర్ఎలు మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా జివిల్ నరసింహులు, అధ్యక్షులుగా జి పెద్ద నారాయణ, ఉపాధ్యక్షులుగా పి రామచంద్ర, ప్రధాన కార్య దర్శి టి.కృష్ణయ్య, మండల కోశాధికారిగా ఎం వెంకటరమణ, వర్కింగ్ ప్రెసి డెంట్‌గా కేశవ ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విఆర్ఎలు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయం రాహుల్ గాంధీ విజయం : డిసిసి



మాట్లాడుతన్న విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప : 11 సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేసిన కుల గణనపై ఎట్టకేలకు కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకున్నందుకు హర్షణీయమని, ఇందులో, ఈ విజయం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి చెందుతుందని డిసిసి అధ్యక్షులు ఎన్. డి.విజయ జ్యోతి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 202 జులై 30న పార్లమెంట్ సభలో రాహుల్ గాంధీ పార్లమెంట్లో కుల గణన బిల్లును కచ్చితంగా ఆమోదింపజేస్తామని అని స్పష్టంగా ప్రకటించారు అని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గం కుల గణన నిర్ణయం తీసుకున్నా, ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎప్పుడు పూర్తవుతుంది అనే విషయమై స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళన కలిగిస్తోంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తెలంగాణలో కుల గణన పూర్తయింది. దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది అన్నారు. ఈ గణన ద్వారా 50 శాతం రిజర్వేషన్ పరిమితి రద్దు మార్గం ఏర్పడుతుందన్నారు. రిజర్వేషన్ పరిమితి 67 నుండి 68 శాతానికి వరకు పెంచే అవకాశం ఉంటుంది. తమిళనాడులో ఇప్పటికే 68 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని చెప్పారు.